క్లుప్తంగా

నిబంధనలు పాటించాలి



బిక్కవోలులో బాణసంచా తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ సుమంత్

బిక్కవోలు: దీపావళి బాణసంచా తయారు చేసే వ్యాపారులు నిబంధనలను తప్పకుండా పాటించాలని అనపర్తి సీఐ సుమంత్ అన్నారు. బిక్కవోలులోని దీపావళి సామగ్రి తయారీ కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఎస్సై రవిచంద్ర కుమార్, సిబ్బంది ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న సీఐ సత్య కిశోర్

మధురపూడి: కోరుకొండ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రజలకు, ఉద్యోగులకు గురువారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై.సత్య కిశోర్, ఎస్సై టీఎస్‌వీఎస్ శ్యామ్ సుందర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వాటి విషయంలో తీసుకునే జాగ్రత్తలు, ఒకవేళ సైబర్ నేరానికి గురైన తర్వాత తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. బాధితులు టోల్ ఫ్రీ నంబర్ 1930కి ఫోన్ చేయాలని కోరారు. తద్వారా నేరగాళ్ల బ్యాంకు ఖాతాను సీజ్ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు.

ఎరువుల బస్తాల అప్పగింత

సీతానగరం: వెదుళ్లపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్)లో ఎరువులను ఇన్‌చార్జి సీఈవో మల్ల శివరామకుమారి గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ నగదు గల్లంతవ్వడంతో సీఈవో, గుమస్తా, సేల్స్‌మన్‌లను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గోడౌన్ లోని గుళ్ల సూపర్ 45 బస్తాలు, పౌడర్ సూపర్ 40 బస్తాలు, 20–20 బస్తాలు 208, యూరియా 4, ఎం పొటాష్ 15, 28– 28 బస్తాలు 138, డీఏపీ బస్తాలు 104, పీఎంఎస్ 60, 10–26 రకం బస్తాలు 55, గ్రోమోర్ 20–20 బస్తాలు 63, ఏఎస్ బస్తాలు 2 ఎరువుల బస్తాలను జీరో బ్యాలెన్స్‌తో సస్పెండ్ అయిన సీఈవో సురేంద్ర ఇన్‌చార్జి సీఈవో శివరామకుమారికి అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రుణాలు తీసుకున్న రైతులకు సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలించాల్సి ఉందన్నారు.

14 నుంచి పల్లె పండుగ

రాజానగరం: పంచాయతీ వారోత్సవాలలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో ఈ నెల 14 నుంచి 20 వరకు పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను ఎంపీడీఓ జేపీ రూన్సీ గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగే గ్రామ సభలలో జాతీయ ఉపాధి హామీ పథకం, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టే పనుల గురించి చర్చిస్తారు.

కస్తూర్బా గాంధీ ఆశ్రమానికి పూర్వవైభవం



కస్తూర్బా గాంధీ ఆశ్రమంలో జ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ

సీతానగరం: కస్తూర్బాగాంధీ ఆశ్రమానికి పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. సీతానగరంలోని కస్తూర్బాగాంధీ ఆశ్రమాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ, కస్తూర్బా గాంధీ విగ్రహాలకు ఖాదీ దండలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆశ్రమం ప్రారంభించి వందేళ్లు పూర్తి కాబోతున్న సందర్భంగా అత్యంత ఘనంగా వేడుకలు నిర్వహిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

పామాయిల్ తోటలో పాములు

రంగంపేట: పామాయిల్ తోటలో పాములు హల్‌చల్ చేయడంతో రైతులు ఆందోళన చెందారు. కోటపాడు గ్రామంలోని శిరిగిన వెంకటేష్‌కు చెందిన పామాయిల్ తోటలో రెండు పాములు కనిపించాయి. తోటలోని ఎండు ఆకుల గుట్టలను తొలగిస్తుండగా బయటకు వచ్చాయి. వాటిలో ఒక తాచు, మరొకటి పొడ పాముగా గుర్తించారు. ఇవి రెండూ విషపూరితమైనవి కావడంతో భయాందోళనకు గురయ్యారు. ఎవరికైనా అపాయం కలిగించే అవకాశం ఉందని వాటిని హతమార్చారు. పామాయిల్ తోటల్లోని చెత్తా చెదారంలో పాములు ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటాయని, సంచరించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని రైతులు సూచిస్తున్నారు.

సేవలకు సెలవేనా..

- ప్రారంభం కాని ప్రభుత్వ వెబ్ సైట్లు
- వెలవెలబోతున్న సచివాలయాలు
- అవస్థలు పడుతున్న ప్రజలు

బిక్కవోలు: గ్రామ స్వరాజ్య స్థాపన కోసం మహాత్మా గాంధీ ఎన్నో కలలు కన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం బాగుపడుతుందని అనేక సందర్భాల్లో తెలిపారు. ఆయన కలలను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారు. ప్రతి గ్రామంలోనూ రెండు వేల మంది జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేశారు. దానిలో వివిధ శాఖలకు సంబంధించి ఉద్యోగులను నియమించారు. గ్రామస్తులకు అవసరమైన ప్రతి పని అక్కడే జరిగేలా చర్యలు తీసుకున్నారు. దీంతో సచివాలయం వ్యవస్థ ఎంతో విజయవంతమైంది. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం దానికి తూట్లు పొడుస్తోంది. సచివాలయాల్లో అందే సేవలకు కోత విధించింది.

ఎంతో ఉపయోగం

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారు. దీనికి అనుసంధానంగా వలంటీర్లను నియమించారు. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ సేవలందించేలా చూశారు. అలాగే సచివాలయాల్లో దాదాపు 545 రకాల సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ వ్యవస్థ ప్రజలందరికీ ఎంతో ఉపయోగంగా ఉండేది. గ్రామంలోనే అన్ని రకాల పనులు జరిగేవి. వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల కోసం మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండేది కాదు.

తెరుచుకోని వెబ్ సైట్లు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ సచివాలయాల వైభవం తగ్గిపోయింది. ఇప్పటికే వలంటీర్ల వ్యవస్థను కుదేలు చేసిన కూటమి ప్రభుత్వం.. సచివాలయ వ్యవస్థను కూడా నిర్వీర్యం చేసేలా కనిపిస్తోంది. సచివాలయాల ద్వారా ఆనాడు ప్రజలకు అందిన సేవలను తగ్గించుకుంటూ పోతోంది. కులం, ఆదాయం, వన్ బీ తదితర సాధారణ సేవలు మాత్రమే ప్రస్తుతం సచివాలయాల్లో అందుబాటులో ఉన్నాయి. ప్రజలకు మరింత అవసరమైన రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్య శ్రీ కార్డుల వెబ్ సైట్లు ఓపెన్ కావడం లేదు. దీంతో సచివాలయాలు వెలవెలబోతున్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కావస్తున్నా.. వెబ్ సైట్లు మాత్రం తెరుచుకోవడం లేదు.

ప్రజల అవస్థలు

సచివాలయాల్లో సేవలు అందక పోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు ఉద్యోగులు పనిలేక ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి. రెండు వేల జనాభాకు సేవలు అందించడానికి ఒక సచివాలయం చొప్పున రూ.45 లక్షలు వెచ్చించి భవనాలను నిర్మించారు. ఇవన్నీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో వివిధ పథకాలను దరఖాస్తు చేసుకునే ప్రజలతో కిటకిటలాడేవి. కూటమి ప్రభుత్వం వెబ్ సైట్లను ఓపెన్ చేయకపోవడంతో పథకాలకు దరఖాస్తులు చేసుకునే అవకాశం కూడా లేదు. నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లో 79 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 584 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

గతంలో విమర్శల వెల్లువ

ప్రస్తుత కూటమి నాయకులు గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సచివాలయ ఉద్యోగులపై అనేక విమర్శలు చేశారు. కానీ నేడు కూటమి ప్రభుత్వానికి సచివాలయ ఉద్యోగులకే దిక్కుగా మారారు. ముఖ్యంగా సామాజిక పింఛన్ల పంపిణీలో కీలకంగా ఉన్నారు. అయితే సచివాలయ ఉద్యోగులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు కొనసాగిస్తోంది. ఇటీవల చేపట్టిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా రూపొందించిన స్టిక్కర్లను వారే ఇళ్లకు అతికించాలని ఆదేశించింది. అలాగే పింఛన్ల పంపిణీని తెల్లవారుజామునే చేపట్టాలంటూ ఇబ్బందులకు గురి చేసింది. ఈ సమస్యలపై సచివాలయం ఉద్యోగులు ఆయా ఎంపీడీవోలకు వినతి పత్రాలు అందజేశారు.



ఊలపల్లి గ్రామంలోని సచివాలయ భవనం

సేవలు కొనసాగాలి



సచివాలయాల ద్వారా గతంలో మాదిరిగానే సేవలు కొనసాగాలి. రైస్ కార్డు, పింఛన్ కార్డులు, ఇతర అవసరాల కోసం వెబ్ సైట్లను ఓపెన్ చేయాలి. ప్రజలకు ఇబ్బంది లేకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– పోతుల ప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచి, ఊలపల్లి

ప్రజల బాగోగులు పాలకుల బాధ్యత



రాజానగరం జగనన్న కాలనీలో జరిగిన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- అధికారం శాశ్వతం కాదు
- మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన పెద్దలు.. ఎన్నికల అనంతరం ప్రజల బాగోగుల కోసం పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కానీ నియోజకవర్గంలో ఆ విధంగా లేకపోవడం వలన అనేక మంది పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జగనన్న కాలనీలో గురువారం జరిగిన గృహ ప్రవేశ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను కాలనీ వాసులు కలిసి తమ సమస్యలను విన్నవించారు. నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఇళ్లకు కూడా విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం లేదన్నారు. దానిపై మాజీ ఎమ్మెల్యే రాజా స్పందిస్తూ పదవులు ఎవ్వరికీ శాశ్వతం కావన్నారు. అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజాభిమానం పొందేలా పాలకుల నడవడిక ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుందేటి ప్రసాద్, ఉప సర్పంచ్ కొల్లి వీర్రాజు, వార్డు సభ్యుడు ప్రగడ చక్రి, సంగీత ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ వనరులను పెంపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్ మన్యం శ్రీనివాస్ చౌదరి

పెదపూడి: గ్రామ పంచాయతీ ఆదాయ వనరులను పెంచడానికి పాలక వర్గం కృషి చేయాలని రిసోర్స్ పర్సన్ మన్యం శ్రీనివాస్ చౌదరి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ చౌదరి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సొంత ఆదాయ వనరులు గురించి అవగాహన కల్పించారు. పన్నులు, పన్నేతరాలను వివరించారు. వేలం పాటలు, కొబ్బరి, పచ్చిగడ్డి, పంచాయతీ చెరువులు, ప్లాన్ అప్రూవల్, లైసెన్స్ ఫీజుల నుంచి పన్నులు ఏ విధంగా వసూలు చేయాలో తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేంద్రరెడ్డి, ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, ఉషారాణి, ఎస్.నాగేంద్ర, సూర్యలక్ష్మి, తరుణ్, ఎస్.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కళ్ల సంరక్షణకు జాగ్రత్తలు అవసరం



ర్యాలీ నిర్వహిస్తున్న రంగంపేట పీహెచ్‌సీ సిబ్బంది

రంగంపేట: ప్రతి ఒక్కరూ తమ కళ్ల సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని కంటి వైద్యాధికారి ఎం.ఇందిర సూచించారు. ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ ఎ.లావణ్య ఆదేశాల మేరకు గురువారం రంగంపేటలో ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.వేణు శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కళ్లపై దృష్టి పెడదాం, కళ్లను ప్రేమించండి అంటూ నినాదాలు చేశారు. డాక్టర్ ఇందిర మాట్లాడుతూ బిడ్డల కంటి శుభ్రత, సంరక్షణలో తల్లి పాత్ర కీలకమన్నారు. పిల్లలకు నాలుగో సంవత్సరం రాగానే కంటి పరీక్షలు తప్పనిసరిగా చేయించాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి, సంరక్షణపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. 40 ఏళ్లు దాటిన వారు, బీపీ, డయాబెటిస్, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ కె.చిన్నారావు, సింగంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సంకీర్తన, సీహెచ్‌ఓ కె.జయమణి, ఎంపీహెచ్‌ఈఓ పి.ప్రసాద్, ఎంపీహెచ్‌ఎస్ పి.నాగలక్ష్మి పాల్గొన్నారు.

ముగిసిన గురుచరిత్ర పారాయణ



పారాయణ చేసిన భక్తులకు బాబా శేష వస్త్రాలు అందించిన ఆలయ సిబ్బంది

రాజానగరం: లోక కల్యాణం, ప్రజా సంక్షేమాన్ని కోరుతూ రాజానగరంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో 12 గురువారాలుగా చేపట్టిన గురు చరిత్ర, సాయి సచ్చరిత్ర పారాయణ కార్యక్రమాలు ఈ వారంతో ముగిశాయి. స్థానిక సాయిభక్త మండలి ఆధ్వర్యంలో జరిగిన ఈ పారాయణలో పాల్గొన్న భక్తులకు ఈ సందర్భంగా సాయిబాబా శేష వస్త్రాలను (అలంకరించిన దుస్తులు) బహుమతిగా అందజేశారు.

10న బాబా సమాధి ఉత్సవం

సాయిబాబా పరమ పదించిన రోజు విజయ దశమి కావడంతో ఆ రోజున భక్తులు సమాధి ఉత్సవాన్ని నిర్వహిస్తారు. షిరిడీలో అత్యంత వైభవంగా జరిగే ఈ కార్యక్రమాన్ని రాజానగరంలోని సాయిబాబా ఆలయంలో కూడా శనివారం నిర్వహించనున్నారు. సాయిబాబా నమూనా సమాధిని పుష్పాలతో ఏర్పాటు చేసి ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. అనంతరం అన్నసమారాధన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తులు

బిక్కవోలు: బీసీ, ఈబీసీ, సంచార జాతుల కులాలకు చెందిన విద్యార్థులు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో – 2 పూర్ణచంద్రరావు కోరారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. 9, 10 తరగతులు, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు పీఎం యశస్వీ ఉపకార వేతనాలు పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలకు మించరాదన్నారు. పూర్తి వివరాలు వెబ్ సైట్‌లో ఉన్నాయని తెలిపారు.

పల్లె పండుగను విజయవంతం చేయాలి

బిక్కవోలు: పల్లె పండుగ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో రత్నకుమార్ అన్నారు. ఆయన గురువారం మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 20 ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. 14వ తేదీన ఆరికరేవులలో ఆరు పనులకు 34.46 లక్షలు, కొంకుదురులో రెండు పనులకు 15.79 లక్షలు, మెళ్లూరులో పది పనులకు 28.28 లక్షలు ఖర్చు చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి సర్పంచులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు.

యువకుడి అదృశ్యం మిస్టరీ వీడేనా!

- 45 రోజులైనా దొరకని ఆచూకీ
- ఆందోళనలో కుటుంబ సభ్యులు



కాపు నాగన్న (ఫైల్)

రాజానగరం: మండలంలోని తూర్పుగానుగూడేనికి చెందిన ఎస్సీ యువకుడు కాపు నాగన్న (35) అదృశ్యమై 45 రోజులు కావొస్తోంది. కానీ అతడి ఆచూకీ మాత్రం దొరకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. నాగన్న ఆగస్టు 27వ తేదీ నుంచి కనిపించడం లేదు. ఈ మేరకు అతడి భార్య చిన్నారి సెప్టెంబర్ 6న రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయినా అతడి అదృశ్యం మిస్టరీగానే మిలిగిపోయింది. గ్రామ శివారున ఉన్న చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన నాగన్న ఇంటికి తిరిగి రాలేదు. అలాగని చెరువులో జారి పడ్డాడా అనే అనుమానంతో చెరువంతా జల్లెడ పట్టారు. అయినా అతని ఆచూకీ దొరకలేదు. కానీ చెప్పులు మాత్రం చెరువు సమీపంలోనే పడివున్నాయి. దీనితో నాగన్న అదృశ్యం కాలేదు, ఏదో జరిగి ఉంటుందనే అనుమానాలు ఎస్సీపేటలో నెలకొన్నాయి. ఫిషర్ మెన్ సొసైటీ ఆధీనంలో ఉన్న ఈ చెరువులో నాగన్న అర్థ రాత్రి సమయంలో చేపలు పట్టి, వాటిని విక్రయించగా వచ్చిన సొమ్ములతో మద్యం తాగేవాడు. ఈ విషయమై గతంలో సొసైటీ సభ్యులు కొందరు నాగన్న ఇంటికి వచ్చి గొడవ చేశారు. అయినా అతడిలో మార్పు రాలేదు. ఈ నేపథ్యంలో అతడు అదృశ్యం కావడంపై పలు అనుమానాలు కలుగుతున్నాయి. నాగన్నకు తల్లిదండ్రులు, తాతయ్య, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా.. ఈ విషయమై స్థానిక సీఐ ఎస్పీ వీరయ్య గౌడ్‌ను అడగగా.. అదృశ్యమైన నాగన్న కోసం గాలిస్తూనే ఉన్నామన్నారు. ఇంత వరకూ ఎటువంటి ఆధారాలు దొరకలేదన్నారు.

సేంద్రియ ఎరువులతో ప్రయోజనం

బిక్కవోలు: సేంద్రియ ఎరువుల వాడకం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయని వ్యవసాయశాఖ ఏవో శామ్యూల్ జాన్ అన్నారు. ఆయన గురువారం మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో వచ్చిన తెగుళ్లను నిర్ధారించుకుని, వ్యవసాయ అధికారుల సలహాతో మందులను పిచికారీ చేయాలన్నారు. రసాయన ఎరువులను ఎక్కువగా వాడటం వల్ల నష్టం కలుగుతుందన్నారు. పందలపాక వ్యవసాయ గ్రామ సలహాదారుడు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శక్తి స్వరూపిణి.. మహాదుర్గ

- భక్తిశ్రద్ధలతో దసరా ఉత్సవాలు
- అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



రంగంపేటలో దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు



చంద్రేడులో మహాదుర్గాదేవి అలంకరణలో అమ్మవారు



వడిశలేరులో విజయదుర్గమ్మ

రంగంపేట: దసరా శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు గురువారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. రంగంపేటలోని దేవీ సెంటర్, ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో ఉదయం అభిషేకాల అనంతరం కలశ స్థాపన, సహస్రనామ కుంకుమార్చన చేశారు. అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. ఆలయ అర్చకుడు నాగేంద్ర శర్మ ప్రత్యేక పూజలు జరిపారు. కట్టుపొంగలి, పులిహోర, పరమాన్నం నైవేద్యంగా సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు, భవానీ మాలధారులు ఆలయానికి పోటెత్తారు. అంతకు ముందు అమ్మవారిని వెండి, బంగారు ఆభరణాలు, గజమాలలతో సుందరంగా అలంకరించారు.

చంద్రేడులో..

స్థానిక కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి, శ్రీదేవి కనకదుర్గమ్మ ఆలయాల్లో అమ్మవారు మహాదుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ఉదయం అభిషేకాలు అనంతరం అమ్మవారిని వెండి, బంగారు నగలతో అలంకరించారు. విద్యార్థులు సామూహిక సరస్వతీ పూజలు నిర్వహించారు. వడపప్పు, పానకం, పులిహోర నైవేద్యం సమర్పించారు.

దొంతమూరులో..

మెయిన్‌రోడ్డులోని విజయదుర్గాదేవి 6వ నవరాత్ర మహోత్సవాల సందర్భంగా ఎనిమిదో రోజు గురువారం అమ్మవారికి పూజలు చేశారు. అర్చకుడు జటప్రోలు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈలకొలనులో..

గ్రామంలోని ముత్యాలమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

వడిశలేరులో..

ఏడీబీ రోడ్డు పక్కనే కొలువైన విజయదుర్గా అమ్మవారిని ఎనిమిదవ రోజు దుర్గాదేవిగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. వెంకటాపురం, దొడ్డిగుంట, సింగంపల్లి, కోటపాడు, ముకుందవరం తదితర గ్రామాలలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

పెదపూడి మండలంలో..

పెదపూడి: దసరా శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా 8వ రోజు గురువారం దుర్గాదేవికి ఘనంగా పూజలు నిర్వహించారు. జి.మామిడాడలోని మణికంఠస్వామి ఆలయంలో అమ్మవారు కనకదుర్గాదేవి అవతారంలో సింహవాహనంపై దర్శనమిచ్చారు. సంపర, పుట్టకొండ, పెదపూడి, పెద్దాడ, ఏపీత్రయం, రామేశ్వరం గ్రామాల్లోని అమ్మవార్లకు సామూహిక కుంకమ పూజలు జరిపారు. అనపర్తి మండలం పీరారామచంద్రపురం దొర్లంబిక అమ్మవారి ఆలయంలోని పీఠంలోని భవానీలు గ్రామోత్సవం నిర్వహించారు. గరగ నృత్యాలు, తీన్‌మారు డప్పులతో ఊరేగింపు వైభవంగా నిర్వహించారు.

అమ్మవార్లకు అభిషేకాలు

బిక్కవోలు: దసరా నవరాత్ర ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మండలం పలు గ్రామాల్లో ఎనిమిది రోజు అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. పందలపాకలోని శ్రీదేవి, రాజరాజేశ్వరి, సంతోషిమాత ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కొమరిపాలెంలోని కనకదుర్గమ్మ, బిక్కవోలులో పార్వతీదేవి, ఊలపల్లిలో కనకదుర్గమ్మ, తొస్సిపూడిలోని నవదుర్గమ్మ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



అనపర్తి మండలం పీరా రామచంద్రపురంలో గరగ నృత్యాలు చేస్తున్న భక్తులు



పందలపాకలో దుర్గాదేవి అలంకరణలో రాజరాజేశ్వరి



జి.మామిడాడలో సింహవాహనంపై దర్శన మిచ్చిన కనక దుర్గాదేవి